AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. గోడౌన్‌ను వేసిన సీళ్లను, పోలీసు బందోబస్తు తీరును గమనించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఫైర్ ఆఫీసర్ శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ధన్వాల్, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి ఉన్నారు.


22-10-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## సిద్ధరామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భిక్కనూరులోని శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ హాజరయ్యారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఛైర్మన్‌గా తాటిపాముల లింబాద్రి, వైస్ ఛైర్మన్‌గా అందే దయాకర్ రెడ్డి, డైరెక్టర్లుగా సింగారపు నర్సమ్మ, నీలా అంజయ్య, అనుగు అమృత, సామ సంతోష్ రెడ్డి, పెంజర్ల ఈశ్వర్ రెడ్డి, ముత్తన్న ఓల్ల కిష్టయ్య, నాగర్తి రమేష్ రెడ్డి, గుడిసె నారాయణ, లింగి భాగయ్య, మోకాళ్ళ బాపురెడ్డి, చీకోటి ప్రభాకర్, అక్కు కార్తీక్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. భిక్కనూరు సిద్ధ రామేశ్వర ఆలయం పురాతనమైందన్నారు. ఆలయం ద్వారానే భిక్కనూరుకు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ.. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, ఎడ్ల రాజిరెడ్డి, భీమ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, సుతారి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి రాజాగౌడ్, జనగామ రాజు, బల్యాల సుదర్శన్, గోనె శ్రీనివాస్, దేవరాజ్ గౌడ్ పాల్గొన్నారు.



## రైతులకు పారదర్శకంగా చెల్లింపులు

**అక్షరటుడే, బీర్కూర్:** రైతులకు పారదర్శకంగా చెల్లింపులు జరగాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొర్ర లక్ష్మి సూచించారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. వరి ధాన్యం తూకం విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం నిల్వ, రవాణా, చెల్లింపుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో పీడీ సురేందర్, డీసీవో రామ్మోహన్ రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, డీఎం శ్రీకాంత్, డీపీఎం సాయిలు, ఏపీఎం శిరీష, సెంటర్ ఇన్‌ఛార్జి మహేందర్, గ్రామ సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, వీవోఏ కవిత, మోహన్ కృష్ణ ఉన్నారు.



# త్వరలో స్టేషన్ల అప్‌గ్రేడ్..

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పలు పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్ కాబోతున్నాయి. ప్రస్తుతం సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌హెచ్‌వోలుగా (స్టేషన్ హౌస్ ఆఫీసర్) వ్యవహరిస్తున్న పలు స్టేషన్లు.. ఇన్‌స్పెక్టర్లు ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరించే స్థాయికి అప్‌గ్రేడ్ కానున్నాయి. ఇప్పటికే కమిషనరేట్ అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించారు. దీనికి ప్రభుత్వం అతి త్వరలోనే ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

- అక్షరటుడే, నిజామాబాద్

▸ ఇప్పటికే జిల్లా నుంచి ప్రతిపాదనలు ▸ త్వరలో ఆమోదం తెలిపే అవకాశం ▸ వెలువడనున్న ఉత్తర్వులు

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌గా మారిన ప్పటికీ స్టేషన్ల అప్‌గ్రేడ్ మాత్రం జరగలేదు. శాంతి భద్రతల పర్యవేక్షణ, పరిపాలన సౌలభ్యంలో భాగంగా కమిషనరేట్ పరిధిలో ఉన్న స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు ఎస్‌హెచ్‌వోలు ఉంటారు. 2016లో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌గా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క ఠాణాను కూడా అప్‌గ్రేడ్ చేయలేదు. వాస్తవానికి పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాలని అధికారులు పంపిన ప్రతిపాదనలు ఏళ్లుగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. కాగా.. జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న పలు పరిణామాలు, తాజాగా కానిస్టేబుల్ హత్య ఉదంతం ఘటన నేపథ్యంలో స్టేషన్ల అప్‌గ్రేడ్ అంశం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

### ఓకే చెప్పిన డీజీపీ

రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయ్ మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చి వెళ్లిన విషయం తెలిసిందే. రౌడీ షీటర్ రియాజ్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని వారు పరామర్శించారు. అనంతరం కమిషనరేట్ కార్యాలయంలో పలు కీలక విషయాలపై ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సాయి చైతన్యతో కలిసి చర్చించారు. ఇదే సమయంలో స్టేషన్ల అప్‌గ్రేడ్ పెండింగ్ విషయం చర్చకు వచ్చినట్లు సమాచారం. ప్రతిపాదనలు పంపిన మేరకు స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసేందుకు డీజీపీ, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ ఓకే చెప్పారని తెలిసింది. ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

### అప్‌గ్రేడ్ అయ్యే స్టేషన్లు ఇవే..

జిల్లాలో ఎస్‌హెచ్‌వోలుగా అప్‌గ్రేడ్ అయ్యే స్టేషన్లలో నగరంలోని నాలుగో టౌన్ ఠాణా మొదటి వరుసలో ఉంది. ఈ స్టేషన్ పరిధిలో మొదటి నుంచి క్రైమ్ రేట్ ఎక్కువ. స్టేషన్ పరిధి కూడా ఎక్కువే. అలాగే నిజామాబాద్ రూరల్ స్టేషన్ కూడా ఎస్‌హెచ్‌వోగా అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది. ఆర్మూర్, బాల్కొండ, బోధన్, నిజామాబాద్ రూరల్ పరిధిలోని ఒక్కో స్టేషన్ చొప్పున అప్‌గ్రేడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే కమిషనరేట్ పరంగా పోలీస్ కమిషనర్‌కు ఉన్న విస్తృత అధికారాలను ఉపయోగించి నాలుగో టౌన్, రూరల్ స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించే అవకాశాలు ఉన్నాయి.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ డివిజన్‌లో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి, ఆర్మూర్ మండలం పిప్రి గ్రామాల్లో కొనసాగుతున్న కేంద్రాలను పరిశీలించారు. రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న పంట నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద ఆరబెట్టిన మొక్కజొన్న నిల్వలను పరిశీలించి, రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కనీస మద్దతు ధర అందించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తేమ 14 శాతానికి లోబడి ఉండేలా ఆరబెట్టి, శుభ్రపర్చిన మొక్కజొన్న పంటను కేంద్రాలకు తెచ్చి పూర్తి స్థాయిలో మద్దతు ధర పొందాలన్నారు. కాగా.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగిన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాల నిర్వాహకులను కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రైతులు తెచ్చిన పంట నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం జరిపించి, ట్యాబ్ ఎంట్రీ చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మొ



క్కజొన్న కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా కృషి చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్ తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం..

### 125 మంది జీపీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కామారెడ్డి కలెక్టర్ కొరడా ఝులిపించారు. ఏకంగా 125 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎప్పటికప్పుడు అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నారు. అయినా అనుకున్న స్థాయిలో పనుల్లో పురోగతి కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యటనలకు వెళ్లినప్పుడు ఈ విషయాన్ని గుర్తించిన కలెక్టర్ చర్యలకు పూనుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కనీస మార్కింగ్ చేయడంలో విఫలమైన 125 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని 125 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలోని ప్రతి మండలంలో ఇందిరమ్మ నిర్మాణాలు మార్కింగ్ చేయకుండా ఐదుగురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ జారీ చేశారు. ఈనెల 15న షోకాజ్ నోటీసులు జారీ చేసినా ఎక్కడ కూడా ఈ విషయం బయటకు పొక్కలేదు. ఈ విషయమై పలువురు పంచాయతీ కార్యదర్శులకు ఫోన్‌చేసి వివరణ కోరగా షోకాజ్ నోటీసులు వచ్చిన విషయం నిజమేనన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో బాటమ్‌లో ఉన్న మండలాలకు చెందిన కార్యదర్శులందరికీ నోటీసులు వచ్చాయన్నారు.

## శ్రీరాంసాగర్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. ప్రస్తుతం 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు గోదావరి లోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 4 వేలు, సరస్వతి కాలువకు 650, లక్ష్మి కాలువకు 200, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉంది. కాకతీయ కాలువ, ఎస్కేప్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో ఎస్సారెస్పీ దిగువన గల జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి చేపడుతున్నారు.

### నిజాంసాగర్ ఒక గేటు ఎత్తివేత

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 4,048 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేమొత్తంలో నీటితో నిండుకుండలా ఉంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండడంతో ఒక గేటు ఎత్తి 4,048 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

## రవాణా శాఖ చెక్‌పోస్టుల మూసివేత

### బారికేడ్ల తొలగింపు, సామాగ్రి తరలింపు




కామారెడ్డి జిల్లా పొందుర్తి చెక్‌పోస్టు వద్ద బారికేడ్లను తొలగిస్తున్న సిబ్బంది

**అక్షరటుడే, ఇందూరు/కామారెడ్డి:** రవాణా శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు చెక్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని రవాణా శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గాప్రమీల ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఫర్నిచర్, రశీదులు, పరికరాలు కంప్యూటర్లను కార్యాలయంలో అప్పజెప్పాలని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర అనుమతులకు సంబంధించిన సేవల కోసం ఇకపై ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పేర్కొన్నారు. అలాగే చెక్‌పోస్టుల వద్ద భారీకేడ్లు, బోర్డులు తొలగించి, సేవలకు సంబంధించిన లభ్యత వివరాలను ప్రదర్శించాలని సిబ్బందికి ఆదేశించారు. ఇకపై చెక్‌పోస్టుల సేవలను www.transport.telangana.govin వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని సూచించారు. చెక్‌పోస్టుల్లో వాహనాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉండబోవన్నారు. కాగా.. ఉమ్మడి జిల్లాలో మూడు చెక్‌పోస్టులు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని పొందుర్తి, సలాబత్ పూర్ చెక్ పోస్టులను అధికారులు తొలగించారు. చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, బోర్డులు తొలగించారు. అలాగే కార్యాలయంలోని ఫర్నిచర్, కంప్యూటర్లు ఇతర సామగ్రిని తరలించారు. జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా బారికేడ్లను తొలగించారు.

## కమ్మేసిన పొగమంచు



శీతాకాలం వచ్చేసింది. పల్లెలతో పాటు పట్టణాలను పొగమంచు కమ్మేస్తోంది.. పచ్చని పొలాలపై కమ్ముకుని ప్రకృతి రమణీయతను చాటుతోంది. పెద్దకొడప్‌గల్ మండలంలో బుధవారం ఉదయం కనిపించిన దృశ్యమిది.

– అక్షరటుడే, పెద్దకొడప్‌గల్



## కోమన్‌పల్లి పాఠశాలకు డెస్క్ బెంచీల వితరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని కోమన్‌పల్లి ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త, సమాజ సేవకుడు ఏనుగు దయానంద్ రెడ్డి ట్రస్ట్ తరఫున 25 డ్యూయల్ డెస్క్ బెంచీలు అందజేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బెంచీలు అవసరాన్ని ఆయనకు విన్నవించగా వెంటనే ఆయన స్పందించి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కవిత దాత దయానంద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజగంగారాం, పాఠశాల ఉపాధ్యాయులు వినోద్, గోపాల్, చిన్నయ్య, భగవంతు రావు, రాగసుధ, నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.



## పోలీసు అమరులకు ఘనంగా నివాళులు

**అక్షరటుడే, ఆర్మూర్:** విధి నిర్వహణలో ప్రాణాలొదిలిన పోలీసు అమరవీరులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మావోయిస్టులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ గణేష్‌కు పోలీసు అధికారులు నివాళులర్పించారు. ఈ మేరకు బుధవారం ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణలు కలిసి గణేశ్ ఇంటికి వెళ్లిన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### మెండోరాలో..

మెండోరా మండలంలోని చాకిర్యాల్ గ్రామానికి చెందిన పోలీస్ అమర వీరుడు వోడినాల నర్సయ్యకు పోలీస్ అధికారులు నివాళులర్పించారు. కానిస్టేబుల్ నర్సయ్య 1989లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా.. 1991లో బాంబుపేలుడులో మృతిచెందారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ శ్రీధర్ రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని కలిసి నర్సయ్య ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



## కానిస్టేబుల్ ప్రమోద్ త్యాగం మరువలేనిది: ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ త్యాగం మరువలేనిదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని కానిస్టేబుల్ ప్రమోద్ ఇంటికి వెళ్లి.. కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రమోద్ కుటుంబం ఒంటరిగా లేదని.. ప్రభుత్వం, ప్రజలు వారితో ఉన్నారన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థికంగా, విద్యాపరంగా సహాయం అందిస్తానని ప్రకటించారు. అలాగే ప్రమోద్ పిల్లలు పదో తరగతి వరకు చదువుకునేందుకు విద్యా ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని రౌడీషీటర్లపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీసు శాఖను కోరారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ సీనియర్ నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, భూపతిరెడ్డి, న్యాలం రాజు, శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఉన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని దేశాయిపేట, సోమేశ్వర్, బాన్సువాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా పేకాడుతున్న 14 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.47,610 నగదు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తుల శ్రీధర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

భీమ్‌గల్ మండలంలోని చేంగల్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు, శివాలయ పునఃనిర్మాణ, ప్రతిష్ఠాపనోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభమైన ఉత్సవాలు 26 వరకు ఐదు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో కొనసాగనున్నాయి. - అక్షరటుడే, భీమ్‌గల్



# వైభవంగా బ్రహ్మోత్సవాలు..

■ చేంగల్‌లో లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు ■ 26వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు

చేంగల్ లక్ష్మీ వేంకటేశ్వరాలయం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలతో పాటు శివాలయం పునఃనిర్మాణం పూర్తయిన సందర్భంగా శివ లింగం, నంది విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని కూడా నిర్వహించనున్నారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.

### ఉత్సవాలిలా..

- 22న ఉదయం శివ లింగం, నంది విగ్రహం ప్రతిష్ఠాపన
- 23న ఉదయం పుణ్యాహవచనం, యోగా ద్రవ్యాధివాసం, దృష్టి స్థాపన, ఫల శయ్యాధివాసం
- 24న ఉదయం 6 గంటలకు శివ లింగం, నంది విగ్రహ ప్రతిష్ఠాపన, యంత్ర మూర్తి, శిఖర ప్రతిష్ఠాపన, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి



బ్రహ్మోత్సవాలు ప్రారంభం.

- ఉదయం 8 గంటల నుంచి పుణ్యాహవచనం, 10 గంటల నుంచి ఇతర పూజాది కార్యక్రమాలు
- 25న ఉదయం 8 గంటలకు సుదర్శన హోమం, 108 కలశాలతో గ్రామంలో తీర్థోత్సవం. ఉదయం 9 నుంచి కుంభ పూజ.
- 26న స్వామి వారి పరివార సందర్శనం.
- మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం 2 నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.
- సాయంత్రం 5 నుంచి రథోత్సవం, రాత్రి 8.30 గంటలకు పల్లకీసేవ ఉంటుంది.

### భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలి..

ఆలయ 25వ వార్షికోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఆలయ బ్రహ్మోత్సవాలతో పాటు, శివాలయ ప్రతిష్ఠాపన ఉంటుంది. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలి. - ఆలయ కమిటీ సభ్యులు



## ప్రణాళికతో ఇంటర్ సిలబస్‌ను పూర్తి చేయాలి

**అక్షరటుడే, ఇందూరు :** ఇంటర్ విద్యార్థులకు నవంబర్‌లో సిలబస్ పూర్తి చేయాలని.. ప్రాక్టికల్స్‌కు సన్నద్ధం కావాలని ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల మరమ్మతుల కోసం కేటాయించిన నిధులను వినియోగించి సివిల్, ఎలక్ట్రికల్, ఫర్నిచర్ పనులను చేయాలన్నారు. అలాగే ప్రయోగశాలలకు కేటాయించిన నిధులతో అవసరమైన మెటీరియల్ సమకూర్చుకోవాలని సూచించారు. త్వరలో ఇంటర్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు బోర్డు తేదీలను ప్రకటిస్తుందని చెప్పారు. గతేడాది నిర్వహించిన 90 రోజుల ప్రణాళికను ఈసారి కూడా అమలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్ ద్వారానే అధ్యాపకులు సెలవుల కోసం అనుమతి పొందాలన్నారు. ప్రధానంగా టీచింగ్ డైరీలను ఆన్‌లైన్‌లో పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు.

## ఎల్లారెడ్డిలో అలరించిన ఫ్రెషర్స్ పార్టీ




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ అలరించింది. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే జరిగిందని.. కష్టపడి చదివితే ఎవరైనా ఉన్నత స్థానాలు చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తు బాగుండాలంటే బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, కామర్స్ హెచ్‌వోడీ శివ కుమార్, నాగనిక, గంగారెడ్డి, అధ్యాపకులు సిద్దురాజు, కృష్ణప్రసాద్, శశిధర్, చంద్రకాంత్, సంతోష్, గోదావరి, రాణి, సురేష్ రెడ్డి, సంగీత, కీర్తి స్వప్న, కిరణ్ కుమార్, మోయిన్, దశరథ్, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.




## పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్ రెడ్డి సూచించారు. వేల్పూర్ మండలంలో సాయిపేటలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల పైబడిన గోజాతి, గేదెజాతి పశువులన్నిటికీ టీకాలు వేయించాలని సూచించారు. గాలికుంటు ప్రబలితే పశువుల నోటిలో, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయని వివరించారు. పశువుల్లో అధిక మొత్తం పాల దిగుబడి తగ్గి పాడి రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందన్నారు. ఆయన వెంట పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి సంతోష్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది, గంగాధర్, దయానంద్, ఓఎస్ జావిద్ ఉన్నారు.



## కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని వేంపల్లి ప్రాథమిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మక్కలు, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముత్యం రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చందా రవి, సీఈవో అశోక్, వివిధ గ్రామాల రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కోనాపూర్ స్కూల్‌కు ఫైవ్ స్టార్ రేటింగ్

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాల స్వచ్ఛహరిత విద్యాలయ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం చౌడారపు రాంప్రసాద్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, వాననీటి సంరక్షణ, మరుగుదొడ్లు, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో పరిశుభ్రత అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ప్లాస్టిక్ నిషేధం, కిచెన్ గార్డెన్, పాఠశాల ఎకో క్లబ్ ఏర్పాటు, కంపోస్ట్ ఎరువు తయారీ, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్ ప్రశ్నావళి ద్వారా ఎంపిక చేసినట్లు వివరించారు. ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని తెలిపారు.



## అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో నిర్మించిన ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జపాన్ శాస్త్రవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పైడి ఎల్లారెడ్డి అన్నారు. అయ్యప్ప ఆలయంలో వివిధ పనులకు ఆయన భూమి పూజచేసి, మొదటి విడతగా రూ.50వేలు ఆలయ కమిటీ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్‌కు అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి కూడా తన తోడ్పాటు ఉంటుందని ఈ సందర్భంగా ప్రకటించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాథ్, ప్రతినిధులు గురుస్వామి చంద్రం, ఆకుల కిష్టయ్య, పప్పు వెంకటేశం, ప్యాలాల రాములు, నవీన్, బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింలు, బీజేపీ సీనియర్ నేతలు దేవేందర్, బాలకిషన్, రాజేశ్వర్, కాశీనాథ్, ప్రసాద్, అల్లం పండరి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



నగరంలోని హనుమాన్ జంక్షన్ కొమురం భీం విగ్రహం వద్ద..



బాల్కొండ మండలంలోని బస్సాపూర్‌లో..

# ఉమ్మడిజిల్లాలో కొమురంభీం జయంతి

ఆదివాసుల ఆరాధ్య దైవం, హక్కుల సాధన కోసం పోరాడిన వీరుడు కొమురం భీం జయంతిని ఉమ్మడి జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కొమురం భీం విగ్రహాలతో పాటు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసుల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన కొమురం భీం ఆలోచనలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



ముప్కాల్ మండలంలో..



బాన్సువాడ మండంలోని హన్మాజీపేట గ్రామంలో..